
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 20 డిసెంబరు 2024



వణికిస్తున్న చలి

▸ రెడ్డిపల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వారం రోజుల నుంచి చలి చంపేస్తుంది. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లిలోని కేసవరంలో 12.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.


పాలు పితుకుతున్న పాడి రైతులు


పొలం పనులకు వెళ్తున్న రైతులు


చలిలో న్యూస్‌పేపర్ ఏజెంట్లు

ఇగంలో శ్రమైక జీవనం

కొన్ని రోజులుగా చలి గజ్జున వణికిస్తుంది. ఇళ్ల నుంచి బయటకు రావడానికే జనం జంకుతున్నారు. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఆ... ఊ... అంటూ వణికిపోతున్నారు. హిమాలయాలను తలపిస్తున్న వాతావరణంలోనూ ప్రజలు తమ జీవన పోరాటాన్ని ఆపడం లేదు. వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తూ గడ్డ కట్టే చలిలోనూ ముందుకు సాగుతున్నారు. చేవెళ్ల డివిజన్‌లో రెండు రోజులుగా 6.8, 6.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇంత చలిని సైతం లెక్క చేయకుండా ప్రజలు, రైతులు వారివారి పనుల్లో నిమగ్నమవుతున్నారు. చలికి భయపడి ఇంట్లో కూర్చుంటే బతుకు బండి సాగడం కష్టమని తెల్లవారుజామున ఐదు గంటలకే రైతులు పొలం బాట పడుతున్నారు. పాడి రైతులు పాలు పితికి ఇంటింటికీ తిరిగి పోస్తున్నారు. ఇగం పుట్టిస్తున్నా ఏజెంట్లు, బాయ్‌లు న్యూస్ పేపర్లను ఇంటింటికీ వేసి వస్తున్నారు. చలి నుంచి రక్షణకు పొందేలా దుస్తులు ధరించి శ్రమైక జీవనం సాగిస్తున్నారు. చేవెళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)


హెల్ప్‌డెస్క్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

టూరిజం సమాచారం కోసమే

హెల్ప్‌డెస్క్

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అందుబాటులోకి..

తెలంగాణలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తాం
రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు టూరిజంపై పూర్తి సమాచారం తెలుసుకోవడానికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ టూరిజం హెల్ప్‌ డెస్క్ సెంటర్‌ను ప్రారంభించామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గురువారం ఎయిర్‌పోర్టులో టూరిజం సమాచార నూతన కేంద్రాన్ని ఆయన జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గొప్ప చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాలు, జలపాతాలు, ప్రకృతి అందాలు, చార్మినార్, గోల్కొండ పోర్ట్, హుస్సేన్ సాగర్, సాలర్‌జంగ్ మ్యూజియం, అనంతగిరి కొండలు వీటితో పాటు అనేక పర్యాటక కేంద్రాలున్నాయని తెలిపారు. మున్ముందు మరిన్ని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామని మంత్రి చెప్పారు. విమానం దిగగానే పర్యాటక కేంద్రాల సమాచారం తెలుసుకునేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సెంటర్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థల చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి (ఐపీఎస్) పర్యాటక సంచాలకులు హనుమంతు, జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయులుకు జాతీయ కళారత్న అవార్డు


అవార్డును అందుకుంటున్న వీరాంజనేయులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సోలిపూర్ నివాసి పి.వీరాంజనేయులుగౌడ్‌ను బహుజన సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ జాతీయ కళారత్న అవార్డును ఇచ్చి సత్కరించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. రాజకీయ నాయకుడిగా, సామాజికవేత్తగా వివిధ రంగాలలో నిజాయితీగా చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించడం సంతోషంగా ఉందన్నారు.


ఉరుకుల పరుగుల జీవన ప్రయాణంలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. క్షణం తీరిక లేకుండా ఉద్యోగ, వృత్తి రంగాల్లో పోటీ పడి రాణించేందుకు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. సమయం లేదనే సాకుతో జంక్‌ఫుడ్‌కు అలవాటు పడి బీపీ, షుగర్ తదితర వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. సరైన వ్యాయామం లేకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం, పొగాకు, మద్యం తదితర అలవాట్లతో రక్తపోటు, మధుమేహం ఎటాక్ అయ్యి నరకం అనుభవిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడంలో నిర్లక్ష్యం చేయడం వలన నేడు ఈ వ్యాధులను తగ్గించుకునేందుకు అపసోపాలు పడుతున్నారు.

షుగర్ టెన్షన్ బీపీ భయం



జిల్లాలో పెరుగుతున్న బాధితులు

- పురుషుల్లో రక్తపోటు.. మహిళల్లో మధుమేహం అధికం
- పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా సమస్య
- ఆస్పత్రుల్లో టెల్మిసార్టన్ 40ఎంజీ టాబ్లెట్ల కొరత
- ప్రైవేట్ మెడికల్ షాపులకు పరుగులు



2024 జనవరి నుంచి డిసెంబరు 19వ తేదీ వరకు వివరాలు

బీపీ, షుగర్ రిజిస్టర్డ్ కేసులు	13,75,409
పరిశీలించినవి	1,64,239
బీపీ నిర్ధారణ	95,238
పురుషులు	57,143
మహిళలు	38,095
షుగర్ నిర్ధారణ	47,591
పురుషులు	19,036
మహిళలు	28,555

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జనవరి నుంచి డిసెంబరు వరకు 13,75,409 మంది బీపీ, షుగర్‌కు సంబంధించిన కేసులు రిజిస్టర్ కాగా, అందులో 1,64,239 మందిని పరిశీలించారు. ఈ పరిశీలనలో 95,238 మందికి రక్తపోటు ఉన్నట్లు తేలింది. అందులో మహిళల కంటే.. పురుషుల్లోనే అధికంగా అధిక రక్తపోటు బారిన పడ్డారు. అలాగే 47,591 మంది షుగర్ బారిన పడగా అందులో మహిళలే అధికంగా ఉన్నారు. బీపీ, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలే కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతీ పది మందిలో ఒకరికి బీపీ, 30 ఏళ్లు నిండిన ప్రతీ ఎనిమిది మందిలో ఒకరికి షుగర్ ఉంటున్న పరిస్థితి ఉందంటే.. ఈ సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో 26 శాతం, పట్టణాల్లో 30 శాతం బీపీ బాధితులున్నారని అంచనా. అదే షుగర్ విషయానికొస్తే పల్లెల్లో 19 శాతం, పట్టణాల్లో 24 శాతం బాధితులున్నారు. జీవనశైలి కారణంగా తలెత్తే ఈ సమస్యలను

మిగతా 8వ పేజీలో...

బీపీ మాత్రల కొరత

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టెల్మిసార్టన్ 40 ఎంజీ ట్యాబ్లెట్స్ తీవ్ర కొరత ఏర్పడింది. షుగర్ ట్యాబ్లెట్స్ అందుబాటులో ఉన్నప్పటికీ బీపీ మాత్రలు మాత్రం అందుబాటులో లేవు. గత రెండు నెలలుగా బీపీ ట్యాబ్లెట్స్ రోగులకు అరకొర అందుతున్నాయి. పేషెంట్‌కు నెల మొత్తం సరిపోయే విధంగా ఇవ్వాల్సి ఉండగా ఐదు, పది ఇస్తున్నారు. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు సరఫరా తగ్గింది. ఇండెంట్ పెట్టినా? సరిపడా రావడం లేదని ఫార్మసిస్టులు చెబుతున్నారు. పలు ఏరియా ఆస్పత్రుల్లో బయట నుంచి కొని రోగులకు సరఫరా చేస్తున్నారు. బీపీ మాత్రలతో పాటు బీ-12 ఇంజక్షన్లు కొరత ఏర్పడ్డాయి. బీపీ వ్యాధిగ్రస్తులు బయట మెడికల్ షాపుల్లో టెల్మిసార్టన్ 40 ఎంజీ టాబ్లెట్స్ కొనుక్కుంటున్నారు. ప్రభుత్వం బీపీ టాబ్లెట్స్‌ను పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని కోరుతున్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
ఆరుట్ల, మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల సందర్శన

మంచాల/యాచారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉపాధ్యాయులకు సూచించారు. మంచాల మండలం ఆరుట్ల జెడ్పీ హైస్కూల్, యాచారం మండలం మేడిపల్లి హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యారంగంపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలను ప్రైవేటు బడులకు పంపకుండా ఉండాలంటే ప్రభుత్వం ఏం చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. సర్కార్ బడుల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని, ప్రతీ ఏడాది యూనిఫాం, పుస్తకాలు, నాణ్యమైన భోజనం, గుడ్లు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పిస్తుందని చెప్పారు. విద్యార్థులు, గ్రామపెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తహసీల్దారు ప్రసాదరావు, మండల విద్యాధికారి రాందాస్, ప్రధానోపాధ్యాయులు గిరిధర్, రాజగంగారెడ్డి, సుప్రియ, మోహన్‌గౌడ్, తుకారాం పాల్గొన్నారు.

మహిళల అబార్షన్లపై కలెక్టర్ సీరియస్

నివేదిక అందించాలని డాక్టర్‌కు ఆదేశాలు.. పెంజర్ల గ్రామంలో పర్యటన


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూర్, డిసెంబరు 19:(ఆంధ్రజ్యోతి) : కొత్తూర్ మండల పరిధిలోని పెంజర్ల గ్రామాన్ని గురువారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సబ్‌సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పెంజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. వాటిల్లో మహిళల అబార్షన్లు అధికంగా ఉండటంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ విషయంపై ఏఎన్ఎం, సిబ్బందిని ప్రశ్నించారు. కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం డాక్టర్ హరికిషన్‌కు ఫోన్ చేసి అబార్షన్లపై ఆరా తీశారు. దీనిపై సమగ్ర రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వే విధి విధానాలు, గైడ్‌లైన్స్, క్రైటీరియా, ఫూర్ క్రైటీరియా తదితర అంశాలపై గ్రామ కార్యదర్శి సురేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల పూర్తి వివరాలు నమోదును పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆంగ్లంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు 10/10 మార్కులు సాధిస్తే 10వేల రూపాయలు బహుమతిగా ఇవ్వబడుతుందని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యంలో పురుగులు వస్తున్నాయని వంట నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ బియ్యం మార్చాలని ఎంఈవో అంగోర్‌నాయక్‌ను ఆదేశించారు. అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హౌజింగ్ డీఈ షాకీర్, కొత్తూర్ ప్రత్యేకాధికారి లీనా, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, ఎంఈవో అంగోర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహిన్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలత, గ్రామ కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

నిధుల్లేక నిలిచిన పనులు

డ్రైనేజీ కథ కంచికి..
కాంట్రాక్టర్ ఇంటికి
పూర్తికాని యూజీడీ పనులు
రోడ్డుపైనే మురుగు..
వెదజల్లుతున్న దుర్గంధం
పట్టించుకోని అధికారులు

8

కంపోస్టు షెడ్లు నిరుపయోగం

తడి, పొడి చెత్తను వేరు
చేయడంలో నిర్లక్ష్యం
సేంద్రియ ఎరువు
తయారీలో అలసత్వం
ఉన్నతాధికారుల
పర్యవేక్షణ కరువు

7


కడ్తాల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు

▸ కేంద్ర హోంశాఖ మంత్రి దిష్టిబొమ్మ దహనం
▸ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు

కడ్తాల్/ఆమనగల్లు/ తలకొండపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను హేళన చేస్తూ మాట్లాడటాన్ని నిరసిస్తూ కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లిలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న ఆలోచనలకనుగుణంగానే అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. అంబేద్కర్‌పై ఆది నుంచి బీజేపీ ద్వేశ పూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, మార్కెట్ డైరెక్టర్ అజీం, బోసు రవి, బీచ్యనాయక్, జగన్, మానయ్య, డోకూరు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి ఘన పూజలు

శామీర్‌పేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శామీర్‌పేట గ్రామంలో గురువారం బొడ్రాయి(నాభిశిల) రెండో వార్షిక మహోత్సవం పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ అశోక్, సభ్యులు, భక్తులు బొడ్రాయికి భక్తిశ్రద్ధలతో జలాన్ని పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలు చేశారు. అలాగే గ్రామ దేవతలకు యజ్ఞహోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన పండిత వేదబ్రహ్మణులు మురళీధర్‌శర్మ, ఇతర పండితులు వేదమంత్రోశ్చరణలతో బొడ్రాయికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు విచ్చేసి బొడ్రాయికి, గ్రామ దేవతలకు జలాలను పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలను చేసిన మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



యజ్ఞహోమాన్ని నిర్వహిస్తున్న కట్టమైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, నాయకులు

మతం మారిన వారికి 'ఎస్సీ' హక్కులు వర్తింపచేయొద్దు

ఆమనగల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ నుంచి ఇతర మతంలోకి మారిన వారికి ఎస్సీ లకు కల్పించిన హక్కులు వర్తింపజేయవద్దని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ కోరారు. ఈ మేరకు గురువారం నగరంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మతం మారిన వారికి అంతకుముందు ఉన్న కులంలోని వ్యక్తులకు వర్తించే హక్కులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దన్నారు. ఎస్సీల హక్కులను కాలరాస్తే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

చౌదరిగూడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పేదల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్న జిల్లేడు పంచాయతీ కార్యదర్శి సమతపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గురువారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రభాకర్, మహేష్, వెంకటేష్, బాలమణి, సునీత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో సభ్యుల ప్రమేయం లేకుండా.. అర్హులైన పేదల నుంచి ఇళ్ల సర్వే చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే ఇంటి పర్మిషన్లు మంజూరు చేయడానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీకి చెందిన బోరు మోటర్‌ను విక్రయించడంతో పాటు పంచాయతీ నిధుల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తుందని వారు తెలిపారు.

కాటన్ మిల్లులో పత్తి తూకం

ధారూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మిల్లు వద్ద పత్తి.. రైతుల ఆందోళన' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల పరిధిలోని నాగసమందర్ గ్రామ శివారులో సాయిబాబా పత్తి మిల్లుకు రైతులు తెచ్చిన 75 పత్తి వాహనాలకు టోకెన్లు జారీచేసి తూకం వేయించి కొనుగోలు చేయించామని ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు. మిల్లులో పత్తినిల్వలు నిండిపోయి స్థలంలేనందున మూడు రోజుల పాటు మిల్లును మూసివేస్తున్నామని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న పవన్‌చందు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల సంస్థ జిల్లా మేనేజర్ పవన్‌చందు తెలిపారు. ఇంధనపొదుపు వారోత్సవాల్లో భాగంగా పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, ఇందనం పొదుపుపై అవగాహన కల్పించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటయ్య, శంకరయ్య, బాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. గురువారం 5వ వార్డులో రూ.15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజ్ లావణ్య, నాయకులు అన్నంరాజ్ శ్రీనివాస్, స్థానికులు సత్తయ్య, నాగార్జున, వేణుగోపాల్, జంగారెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేపట్టొద్దు



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపజేస్తున్న పోలీస్‌లు

చేవెళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రధాన రోడ్ల వెంబడి ఫుట్‌పాతులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ వాహనదారులకు ఇబ్బంది కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రధాన రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని కలిసి అవగాహన కల్పించారు. కేవలం ఖాళీ స్థలంలోనే వ్యాపారం చేయాలని, పండ్ల బండ్లు, చాయ్, కూరగాయల దుకాణాలు, డబ్బాలు వంటివి ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కూరగాయలను రైతుబజార్‌లోనే విక్రయించాలని సూచించారు. ఏఎస్సైలు చందర్, అశోక్, ట్రాఫిక్ పోలీస్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి



కందవాడలో మాట్లాడుతున్న ఎస్బీఐ ఆర్‌ఎం పల్లం రాజు

చేవెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో పంట రుణాలు చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలో రాయితీ పొందవచ్చని ఎస్బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు తెలిపారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ గ్రామంలో ఎస్బీఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీలో కొంత వరకు రాయితీ పొందవచ్చని తెలిపారు. రైతులకు ఉపయోగపడే వివిధ రకాల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి మంజూరైన లోన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ చీఫ్ మేనేజర్ తరుణ్‌సింగ్, చేవెళ్ల మేనేజర్ సంధ్యారెడ్డి, మాజీ ఎంపీసీటీ రవీందర్, బ్యాంకు అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బస్సుజాత'ను విజయవంతం చేయాలి

పరిగి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బస్సుజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. బస్సుజాతకు సంబంధించిన పోస్టలర్లను గురువారం పరిగిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబరు 15న ప్రారంభమైన బస్సుజాత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుందని తెలిపారు. ఈ నెల 21న ఆశావర్కర్ల బస్సుజాత కార్యక్రమం పరిగికి వస్తుందని తెలిపారు. ఆశాలకు నెలకు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి,కంటి వెలుగు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగమ్మ, నాయకులు పద్మ,అనసూయ,స్వరూప,రాధ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కుట్రపూరితం

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా వన్ కార్‌రేస్ విషయంలో కేవలం అభియోగాలతోనే కేసు నమోదు చేయడం అన్యాయమని, కుట్రపూరితం అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గతంలోనే కేటీఆర్ ఈ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని కోరారని, దీనికి సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపినట్లు గుర్తుచేశారు. ఆమనగల్లులో గురువారం జైపాల్‌యాదవ్ విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌పై కేసు కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలో భాగమన్నారు. దీనిపై శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయన్నారు. ఈ కేసు విషయంలో కేవలం అపోహలు సృష్టించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసు గురించి అనేక రకాల అవాస్తవాలను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారని ఆరోపించారు.

నేషనల్ హ్యాకథాన్‌లో 'సెయింట్ పీటర్స్' విద్యార్థుల హవా



హ్యాకథాన్‌లో సెయింట్ పీటర్స్ కాలేజీ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఇండియా-2024లో భాగంగా 36 అవర్స్ జాతీయ హ్యాకథాన్‌లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. మైసూరులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలతో పలు ప్రదర్శనలు ఇచ్చారు. ల్యాప్‌టాప్ వినియోగంలో అత్యాధునిక పద్ధతులను వివరించడంతో పాటు కీబోర్డు, మౌస్ లేకుండా ల్యాప్‌టాప్ వినియోగించటం, దాని వల్ల కలిగే ప్రయోజనాల పట్ల ప్రత్యేక ప్రాజెక్టును విద్యార్థులు చేసి చూపించారు. ఈమేరకు విద్యార్థులకు నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ తదితరులు అభినందించారు.

ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకోవద్దు

శంకర్‌పల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేట్ డ్రైవర్లు చట్టవిరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకోరాదని కొండాపూర్ ఎంవీఐకే అధికారి సునీత, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రైవేటు వాహనాలు, టాక్సీప్లేట్ వాహనాల డ్రైవర్లతో వారు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ మధ్య కాలంలో స్థానిక డ్రైవర్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇతర రాష్ట్రాల వాహనాలను ఆపడం సరికాదన్నారు. ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీలో రూ.5.45 కోట్ల విలువైన పనులకు తీర్మానం



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, పక్కన కమిషనర్ వీరారెడ్డి

ఘట్‌కేసర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం చైర్మన్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ప్రధానంగా యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల, రాక్‌వుడ్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు సంబంధించిన ట్యాక్సులను రీఅసెస్మెంట్ చేయాలని తీర్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ మరమ్మతులు, పారిశుధ్య సిబ్బందికి సంబంధించిన పరికరాలతో పాటు స్టేషనరీ కొనుగోలు, విలీన గ్రామాల సిబ్బంది వేతనాల కోసం మొత్తం రూ.5.45కోట్ల పనులకు తీర్మానం చేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన 8వ వార్డు కౌన్సిలర్ బైర హిమ చిత్రపటానికి పూల మాలలువేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన



జడ్పీహెచ్ఎస్ ఆవరణలో పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కొడంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీహెచ్ఎస్(బాలికలు) ఆవరణలో సీపీఎస్, జడ్పీహెచ్ఎస్‌లకు నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అరబిందో ఫార్మా కంపెనీ సహకారంతో కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అలాగే కొడంగల్ జడ్పీహెచ్ఎస్(బాలుర) నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఎంఈవో రాంరెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

'సర్వే'లో సమగ్ర వివరాలు సేకరించాలి



మేడ్చల్ మున్సిపల్‌లో ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో భాగంగా చేపడుతున్న సర్వేలో సమగ్ర వివరాలు సేకరించాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 7, 8వ వార్డుల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేలో పూర్తి వివరాలు సేకరించినప్పుడే అర్హులైన లబ్ధిదారులకు లాభం చేకూరుతుందన్నారు. సర్వే కార్యక్రమం ఈనెల 31 వరకు పూర్తి చేయాలన్నారు. సర్వేలో భాగంగా సేకరిస్తున్న వివరాల్లో తప్పులు లేకుండా చూడాలని, అధికారులకు లబ్ధిదారులు పూర్తి వివరాలు అందజేయాలన్నారు కాగా, వివరాలు సేకరించే సమయంలో యాప్‌లో తలెత్తుతున్న టెక్నికల్ సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.


బైపాస్ రోడ్డు సర్వేను పూర్తి చేయాలి



చెంగోల్ శివారులో బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు సర్వేను త్వరగా పూర్తి చేయాలని, ప్రజా అవసరాల కోసం రైతులు నుంచి భూములు తీసుకుంటున్నామని, వారికి పరిహారం ఇచ్చేందుకు సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం తాండూరు మండలం చెంగోల్ గ్రామ శివారులోని బైపాస్ రోడ్డు కోసం తీసుకున్న రైతుల భూములను పరిశీలించారు. కాగా, ఇంకా 17 మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉండగా, త్వరలో సర్వే నిర్వహించి అందించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తారాసింగ్‌ను ఆదేశించారు. రైతులు కూడా రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే నివేదిక రాగానే ప్రభుత్వం ద్వారా రైతులకు పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 17మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉన్నందున.. వారి నుంచి ఎన్ని ఎకరాలు తీసుకున్నారనే విషయమై సమగ్రంగా సర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్ రైతులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియంతో నైపుణ్యాలు మెరుగు



జేపీ చౌదరికి జ్ఞాపికను అందజేస్తున్న యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, సీఈవో నీలిమా

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియం అనేది విద్యార్థి కేంద్రీకృత విధానమని, ఇది వాస్తవ ప్రపంచ దృశ్యాలతో నిమగ్నమై ఉంటుందని, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేపీ చౌదరి అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్(పీబీఎల్) సింపోజియాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ సింపోజియంతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడుతాయని గుర్తుచేశారు. పీబీఎల్ వల్ల విద్యార్థి నూతన అవిష్కరణలు చేయడానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. సంక్లిష్ట ఆలోచనలు, సహకారం, జ్ఞానాన్ని ఉపయోగించడంతో పాటు ఓపెన్ ఎండ్ సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. పీబీఎల్ ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పొందుతూ 30 దేశాల్లో అమలు చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం జేపీ చౌదరికి యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, సీఈవో సూర్యదేవర నీలిమ, ప్రతినిధులు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్లారెడ్డిగూడ గ్రామ పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు

కంపోస్టు షెడ్లు.. నిరుపయోగం

- తడి, పొడి చెత్తను వేరు చేయడంలో నిర్లక్ష్యం
- సేంద్రియ ఎరువు తయారీలో అలసత్వం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

చేవెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో పంచాయతీ చొప్పున ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కంపోస్టు షెడ్లు నిర్మించింది. కానీ, ప్రస్తుతం చాలా వరకు గ్రామాల్లో వాటి నిర్వహణను గాలికొదిలేశారు. దాంతో షెడ్లన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి కంపోస్టు ఎరువు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తడి, పొడి చెత్త వేరుచేయడంలో నిర్లక్ష్యం

కంపోస్టు షెడ్లలో తడి, పొడిచెత్తను వేరు చేయడం కోసం విడివిడిగా చిన్నపాటి గదుల్లా నిర్మాణాలు చేపట్టారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, పేపర్లు, అట్టముక్కలు, కరెంటు వస్తువులు, పాత దుస్తులు ఇలా వివిధ రకాల వ్యర్థాలను వేరు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేందుకు వీలుగా నీలి, ఆకుపచ్చ రంగుల బుట్టలను పంపిణీ చేశారు. కానీ, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. దాంతో తడి, పొడిచెత్తను వేరుచేయడం లేదు. ఇక కంపోస్టు షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్మికులు దృష్టి పెట్టలేకపోతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

సేంద్రియ ఎరువు తయారీపై అలసత్వం

తడి, పొడిచెత్తను విడిగా సేకరిస్తే షెడ్ల తొట్టిలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చు. ప్రతీ గ్రామ పంచాయతీలో గతంలో వానపాములు కొనుగోలు చేసేశారు. షెడ్లలో 40 నుంచి 60 రోజుల్లో ఎరువు తయారయ్యేది. ప్రారంభంలో సేంద్రియ ఎరువు తయారీ పనులు బాగానే జరిగినా ప్రస్తుతం పట్టింపులేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి. కాగా, సేంద్రియ ఎరువుకు 50 కిలోల బస్తాకు రూ. 650 వరకు ధర ఉంటుంది. అదే గ్రామంలో తయారు చేస్తే రైతులకు బస్తా ఎరువు కేవలం రూ.200లకే లభిస్తుంది. దాంతో రైతులకు మేలు కలుగుతుంది. సేంద్రియ ఎరువు తయారీ చేయడం వల్ల గ్రామ పంచాయతీలకు కూడా ఆదాయం లభిస్తుంది.

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారిస్తాం



తడి, పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలని ఇప్పటికే గ్రా మాల్లో ప్రజలకు అవగాహన కల్పించాం. కొన్ని జీపీల్లో తడి, పొడిచెత్త సేకరణ సాగుతోంది. తడి చెత్తను వానపాములతో కంపోస్టు షెడ్లలో వేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. మరోసారి అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. పూర్తిస్థాయిలో తడి, పొడిచెత్త సేకరణతో సేంద్రియ ఎరువు తయారీకి పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తాం. - హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

విదేశీ కలుపు మొక్కల నివారణకు కృషి చేద్దాం



యువకులతో కలిసి ర్యాలీ తీస్తున్న ఈకోఫౌన్ ప్రతినిధి సాయిసంపత్

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విదేశీ కలుపు మొక్కల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఈకోఫౌన్ సొసైటీ ప్రతినిధి మెట్టు సాయిసంపత్ తెలిపారు. గురువారం మండలంలోని బద్లాపూర్, కాశీంపూర్, రెడ్డిఘణాపూర్‌లో విదేశీ కలుపు మొక్కల నిర్మూలనకు తీసుకోవాల్సి చర్యలపై ర్యాలీ తీస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మట్లాడుతూ విదేశీ కలుపు మొక్కలు జీవ వైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదకతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా వయ్యారిభామ, సీస కమ్మరి, ఇగడ, బుడిది ఆకం, ముల్లపూకం, తదితర కలుపు మొక్కల వల్ల కలిగే దుష్ప్రభావంపై ప్రజలకు వివరిస్తూ చైతన్యపరిచారు. కలుపు మొక్కల నివారణకు దేశవ్యాప్తంగా సమష్టి కృషి అవసరమని సాయిసంపత్ అన్నారు. స్థానిక యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు 50 రోజులుగా రిలే నిరహర దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జేఏసీ నాయకులతో కలిసి బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిరాణ దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో బిక్షాటన చేశారు. అశోక్‌గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, అనిల్, చంద్రశేఖర్, విజేందర్, చంద్రయ్య, చెన్నయ్య, కృష్ణ, బుచ్చయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే లగచర్ల రైతులకు బెయిల్



దశరథ్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ, గిరిజన సంఘాలపోరాట ఫలితమే లగచర్ల రైతులకు బెయిల్ మంజూరు అయ్యిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో దుర్మార్గ పాలన కొనసాగిస్తూ అమాయక రైతులపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఆయన ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లగచర్ల గిరిజన రైతులకు 40 రోజుల తర్వాత బెయిల్ మంజూరు కావడం హర్షదాయకమన్నారు. అల్లుడికి భూములు కట్టబెట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు భూములు ఇవ్వకూడదని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని చెప్పారు.



అవార్డు అందుకుంటున్న ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, పర్యావరణ ఇంజనీర్ సురేష్

ఆదిభట్ల మున్సిపాలిటీకి చేంజ్‌మేకర్స్ అవార్డు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు లభించింది. 2022-24లో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శనలు చేసినందుకు ఈ అవార్డు దక్కింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలతోపాటు సాలిడ్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీలకు సీఎస్ఈ, మోహువా సంయుక్తంగా గురువారం ఢిల్లీలోని సిల్వర్ హోక్ హాలులో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేశారు. సీఎస్ఈ డైరెక్టర్ డాసునీతాసరైన్ చేతుల మీదుగా ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ, పర్యావరణ ఇంజనీర్ ఆర్.సురేష్ అవార్డు అందుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

బషీరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే కఠినంగా చర్యలు తప్పవని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం గురువారం ఎస్సై బషీరాబాద్‌లోని రైల్వేస్టేషన్ కూడలిలో ఆటో, జీపు డ్రైవర్లతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ అనేక చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానాతో పాటు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



తాండూరు డీఎస్పీ బాలకృష్ణ రెడ్డికి బారికేడ్లను అందజేస్తున్న ప్రైవేటు స్కూల్, కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి వెల్లడించారు. గురువారం తాండూరు ప్రైవేటు స్కూల్స్, జూనియర్ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం 20 బారీకేడ్లను డీఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలంటే నియంత్రణ తప్పనిసరి అని చెప్పారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. బారీకేడ్లను అందించిన స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలను ఆయన అభినందించారు. కళాశాలల సమీపంలో టీజింగ్‌కు పాల్పడకుండా షీటీం గస్తీ పెంచాలని కాలేజీల ప్రతినిధులు డీఎస్పీని కోరారు. సీఐ సంతోష్‌కుమార్ విజ్ఞప్తి మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బారీకేడ్లను అందించినట్లు స్కూల్స్, కళాశాల యజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్య సభ్యులు రంగారావు, పర్యాద రామకృష్ణ, సంగీత, జి.నరేందర్, ఆనంద్, నర్సిములు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌కృష్ణ, అగ్గనూర్ కిరణ్, వెంకట్‌రెడ్డి, ఇందూర్ రాములు, సతీష్, శివ, అభి, షాహెల్, యూనస్, వాహిద్, బాలస్వామి, కవిత, కల్పన, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణ, నాయకులు

పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ వద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డికి కడ్తాల రైతుల వినతి

కడ్తాల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతులు సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటును మార్పించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని స్థానిక నాయకులు కోరారు. గురువారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణల ఆధ్వర్యంలో నాయకులు, రైతులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వేనెంబర్లలోని 150 మంది రైతుల పంట పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టి లైన్ మార్కింగ్ చేశారని ఎమ్మెల్యేకు తెలిపారు. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటు చేసే కొత్త హైటెన్షన్ లైన్‌ను పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే రూ.కోట్ల విలువైన భూములు కోల్పోయి రైతులు రోడ్డున పడుతారని నాయకులు తెలిపారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని అలైన్‌మెంట్ మార్పించాలని శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అధికారుల దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు, రైతులు గూడూరు జంగారెడ్డి, గోరటి జంగయ్య, రాములు, మహేశ్వర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పాండు, రాజేశ్, తదితరులున్నారు.

వెల్జాలను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తలకొండపల్లి : వెల్జాల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వెల్జాల, వెంకటాపూర్, చౌదర్‌పల్లి, మాదాయిపల్లి, అంతారం, జూలపల్లి, చంద్రధన, సంగాయిపల్లి గ్రామాల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వెల్జాల మండల కేంద్రం ఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటుందని నాయకులు వివరించారు. మండల కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని కసిరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంబాజీ, నాయకులు, అంజయ్య గౌడ్, రమేశ్ యాదవ్, అజీజ్, నర్సిరెడ్డి, చెన్నారెడ్డి, అశోక్ బాబు, తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన : బక్కని

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం, పేదరిక నిర్మూలన, పచ్చదనం-పారిశుధ్యం, జవాబుదారితో పనిచేసిన టీడీపీ పాలనను తిరిగి పల్లెల్లో ప్రజలు కోరుతున్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన వస్తుందని ఆయన తెలిపారు. ఈమేరకు గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు గిరిమోని హన్మంతుకు పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చారు. అనంతరం బక్కని విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పల్లె ప్రజలు గుర్తుచేస్తున్నారని తెలిపారు. ప్రజా చైతన్యం తెచ్చి, నిజాయితీ పాలనను అందించామన్న ఆలోచనతో టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన వస్తున్నదని చెప్పారు. తెలంగాణలో అక్టోబరు 26న ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 95,400 మంది సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతీ సభ్యుడికి రూ.5లక్షల ప్రమాదబీమా ఉంటుందని, సహజ మరణం సంభవిస్తే రూ.10 వేలు ఇస్తారని తెలిపారు. సీనియర్ నాయకుడు లింగారం కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



గిరిమోని హన్మంతుకు సభ్యత్వాన్ని ఇస్తున్న బక్కని నర్సింహులు

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఆమనగల్లు/షాద్‌నగర్ రూరల్/యాచారం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల పరిధి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. అధికారులు ఇళ్లను పరిశీలించి అర్హుల వివరాలను మొబైల్ యాప్ లో నమోదు చేస్తున్నారు. సర్వేను గురువారం మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంపీడీవో కు సుమమాధురి పరిశీలించారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపికచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని కార్యదర్శి తెలిపారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు రమేష్, మల్లేష్, హరికృష్ణ, శ్రీధర్‌గౌడ్, పకీర్ పాషా ఉన్నారు. యాచారం ఎంపీడీవో సర్వే బృందానికి సూచనలు చేశారు. యాచారంలో ఇళ్ల సర్వేను పరిశీలించారు. పేదల ఇళ్లకెళ్లి ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉందా? అని తెలుసుకున్నారు. యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో హరితహారం నర్సరీలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఈజీ ఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్ రెడ్డి, పీఎస్ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



లింగారెడ్డిగూడలో ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు



ఆమనగల్లులో సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

నిధుల్లేక నిలిచిన పనులు

- డ్రెయిన్ కథ కంచికి.. కాంట్రాక్టర్ ఇంటికి!
- మొదలైనా పూర్తికాని యూజీడీ పనులు
- మురుగు నీటి దుర్గంధంతో చటాన్‌పల్లి వాసుల ఇక్కట్లు
- మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం


చటాన్‌పల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

షాద్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం చటాన్‌పల్లివాసులకు శాపంగా పరిణమించింది. ఏళ్ల తరబడి మురుగునీరు నివాస ప్రాంతాలు, రోడ్ల మీదుగా పారుతూ దుర్గంధం వస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. కంపు వాసనతో కాలనీల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. సమస్యపై పలుమార్లు బల్దియా అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య వివరాల్లోకి వెళ్లితే ...

షాదనగర్ మునిసిపాలిటీ చటాన్‌పల్లి 4వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ.20లక్షలతో పనులు ప్రారంభించారు. 20 అడుగుల గొయ్యి తీశారు. పనులు చేసేందుకు వచ్చిన కూలీల్లో ఇద్దరు గోతిలో పడి మరణించారు. దీంతో ఈ సమస్య రాజకీయ రంగు పులుముకుంది. కొందరు పైప్‌లైన్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. పనులకు కేటాయించిన రూ.20 లక్షల నిధులూ వెనక్కెళ్లాయి. డ్రెయిన్ పైప్‌లైన్ నిర్మాణం చేయక చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో నివాసం ఉంటున్న వందలాది కుటుంబాలు రోజూ మురుగు నీటి కంపును భరిస్తున్నాయి. కొందరు బాధ భరించలేక సొంతిళ్లను సైతం ఖాళీ చేస్తున్నారు. కిరాణ, సామిల్, ఇతర వ్యాపార షాపులను మూసివేస్తున్నారు.


చెరువును తలపిస్తున్న మురుగు నీటి గుంత

వచ్చిన నిధులేమయ్యాయో..?

మున్సిపాలిటీలో నిధులు లేకనే పనులు చేపట్టడం లేదన్న విమర్శలొస్తున్నాయి. మరి గతంలో వచ్చిన 20 లక్షలు ఏమాయ్యాని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ కారణాలతోనే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పను లు చేయడం లేదని చటాన్‌పల్లి వాసులు ఆరోపించారు. మురుగునీటి దుర్గంధాన్ని ఎన్నాళ్లు భరించాలో తెలియడం లేదని, ఒక్కరోజు మున్సిపల్ అధికారులు ఇక్కడుంటే తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాసనతో ఉండలేకపోతున్నాం



మా ఇంటి ముందు నుంచే డ్రైనేజీ మురుగు నీరు పారుతోంది. ఈ సమస్య తీర్చాలని, డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కంపు వాసనతో అన్నం కూడా సహిస్తలేదు. వర్షాకాలంలో పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. పిల్లలు, పెద్దలకు రోగాలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారాలు వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– భద్రప్ప, చటాన్‌పల్లి

మాగోడు ఎవరూ వినరు



మా కాలనీలో డ్రైనేజీ గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. మున్సిపల్ అధికారులు పట్టించుకోరు. రాజకీయ నాయకులూ స్పందించరు. ఈ దుర్వాసనతో మా ప్రాణాలే పోయేట్టున్నాయి. పదేళ్లుగా ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పేదల ప్రాణాలపై ప్రభుత్వానికున్న శ్రద్ధ అది.

– జహంగీర్, చటాన్‌పల్లి

క్రైం కార్నర్

డివైడర్, స్తంభాన్ని ఢీకొన్న కారు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి డివైడర్, రోడ్డు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురువారం గండిపేట చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ కారు వేగంగా నగరం నుంచి మొయినాబాద్ వైపు హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై వచ్చి అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఆ తరువాత కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. అతడికి గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ జామైంది.

రెండు బైక్‌లు ఢీ.. దంపతులకు గాయాలు

తలకొండపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):చంద్రధన సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్లకు చెందిన జర్పులవత్ లస్కర్ అతడి భార్య వాలి ఇద్దరు ఫుల్‌సింగ్‌తండాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్తున్నారు. చంద్రధన దాటిన తరువాత ఓ బైక్ అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

శ్రీనివాస్‌యాదవ్‌కు సినీ ప్రముఖుల పరామర్శ

తలకొండపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగు ఫిలిం చాంబర్/ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ మెంబర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్‌ను గురువారం పలువురు సినీ ప్రముఖులు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్‌యాదవ్ తండ్రి, రిటైర్డ్ హెచ్‌ఎం జంగయ్యయాదవ్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న సినిమా డైరెక్టర్ అంజి శ్రీనివాస్, నిర్మాత రామాంజనేయులు, సినీహీరో విశ్వకార్తికేయన్ వెల్జాలకు చేరుకొని శ్రీనివాస్‌ను పరామర్శించారు. జంగయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో గోద శ్రీరామ్‌యాదవ్, ప్రొద్దుటూరి రాజు, యాదయ్య, చంద్రయ్యగౌడ్, తిరుపతయ్యగౌడ్ తదితరులు ఉన్నారు. అలాగే శ్రీనివాస్‌ను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించారు. జంగయ్య కుటుంబీకులకు దేవుడు ధైర్యాన్నివ్వాలని ఆకాంక్షించారు.


శ్రీనివాస్‌యాదవ్‌తో సినీ రంగ ప్రముఖులు, ఆర్టిస్టులు

కొత్త మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరు పెట్టాలి


మాట్లాడుతున్న రాంచందర్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడు గ్రామాలతో మొయినాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చదువు రాంచందర్ అన్నారు. ఒక వేళ అదే చేయాలనుకుంటే ప్రపంచ ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ పేరిట మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం చిలుకూరు బాలాజీ ఆలయ కమాన్ (ఆర్చ్) వద్ద ఆయన మాట్లాడారు. మొయినాబాద్ మండల రెవెన్యూ ప్రాంతం 50శాతం చిలుకూరుదేనన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈఓ, తదితర కార్యాలయాలు చిలుకూరు గ్రామ రెవెన్యూలోనే ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా మొయినాబాద్, చిలుకూరు, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, పెద్దమంగళారం, సురంగల్ గ్రామాలతో మున్సిపాలిటీగా చేయాలనుకోవడం తగదన్నారు. మండలంలోనే చిలుకూరు గ్రామం ఎక్కువ ఆదాయం ఉన్న మేజర్ పంచాయతీ అన్నారు. అధికారులు, పాలకులు మున్సిపాలిటీగా ఏర్పాటు మొయినాబాద్ కాకుండా చిలుకూరు బాలాజీ పేరు మీద మున్సిపాలిటీగా చేయాలని సూచించారు. ఈ విషయంపై స్థానికులతో పోరాటం చేస్తామని చెప్పారు.

కొత్త పంచాయతీల కోసం ఎమ్మెల్యేకు ప్రతిపాదన

కందుకూరు/మహేశ్వరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు, మహేశ్వరం మండలాల్లో నూతనంగా 9 పంచాయతీలను ఏర్పాటు చేయాలంటూ మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి గురువారం లేఖ రాశారు. కందుకూరు మండలం గుమ్మడవెల్లి తండా, గఫూర్‌నగర్, మన్నెగూడ, మాలగూడ, పోతుబండతండా.. అలాగే మహేశ్వరం మండలం నల్లచెరువు తండా, దయ్యాలగుండు తండా, ఏనుగుచెరువు తండా, గంగారంతండా, మైలార్‌బాయితండాలను పంచాయతీలుగా మార్చాలని ఎమ్మెల్యే సబిత కలెక్టర్‌కు లేఖ రాశారు.

ఎన్జీవో సేవలు అభినందనీయం


స్టడీ మెటీరియల్‌తో గురుకుల పాఠశాల విద్యార్థినులు

షాబాద్ డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య నందిస్తున్న 'వాయిస్ 4 గర్ల్స్' ఎన్జీవో సంస్థ కృషి అభినందనీయమని గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ వినోల అన్నారు. షాబాద్‌లో నడుస్తున్న ఆమన్‌గల్ బాలికల పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఎన్జీవో సంస్థ ప్రతినిధులు బాలికలకు పది రోజుల పాటు నిర్వహించే విద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఎస్సీ బాలికలకు డిగ్రీ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యనందిస్తున్న సంస్థ కృషి హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీచర్లు, ఎన్జీవో ప్రతినిధులు, విద్యార్థినులు, సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం బాధాకరం

చేవెళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేష్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, యూత్ అధ్యక్షుడు బ్యాగరి ప్రభాకర్ అన్నారు. గురువారం చేవెళ్లలో వారు విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. 'అంబేడ్కర్.. అంబేడ్కర్ అని పదేపదే అనడం ఇప్పుడో ఫ్యాషన్‌గా మారింది. దీనికి బదులు దేవుడిని స్మరిస్తే స్వర్గానికి వెళ్లొచ్చు.' అని పార్లమెంట్‌లో అమిత్‌షా ప్రసంగించడం బాధాకరం అన్నారు. రాజకీయంగా ఉన్నత పదవుల్లో ఉంటూ అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. అంబేడ్కర్‌ను అవమానించే హక్కు ఎవరికీ లేదన్నారు. అమిత్‌షా దేశానికి క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన వాహిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చూచిరాత పరీక్ష పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బస్టాండ్ ఉన్నత పాఠశాలలో బహుమతులు ప్రదా నం చేశారు. విజేతలకు మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి 2వేలు, మూడో బహుమతి రూ. వెయ్యి, ప్రతీ తరగతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి రూ.500 అందజేశారు. బహుమతుల దాతలు వేంకటేశ్వర థియేటర్ యజమాని భారతమ్మ, వాసవి ఎడ్యుకేషన్ సొసైటీ వారు ప్రవీణ్ మెడికల్ హాల్ ప్రవీణ్, గుత్తి మురారి, హైమవతిమదన్‌మోహన్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తల్లోజు లలిత, వెంకటయ్య, ఫౌండేషన్ అధ్యక్షుడు జూలూరు రవీంద్రనాథ్, ప్రధాన కార్యద ర్శి లక్ష్మీనారాయణ, సత్యం, రంగారావు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షకులకు సర్టిఫికెట్ల పంపిణీ

శంషాబాద్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నేడు కంప్యూటర్ విద్య ఎంతో ఉపయోగకరమని సామాజికవేత్త మోర్ఫ్ శ్రీనివాస్ అన్నారు. శంషాబాద్‌లోని సీఎస్సీ అకాడమిలో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంప్యూటర్‌లో శిక్షణ పొందిన వారు ఈ స్కిల్‌తో ఉద్యోగాలు సాధించి కుటుంబాలను పోషించుకోవాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న కోర్సులే కాకుండా ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలన్నారు.కార్యక్రమంలో అకాడమికి చెందిన జాఫర్అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిని కలిసిన రైతులు


పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో రైతులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని బహదూర్‌గూడ రైతులు గురువారం కలిశారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం ప్యాక్స్ చైర్మన్ బి.సతీశ్ ఆధ్వర్యంలో రైతులు కలిసి గ్రామంలోని సమస్యలపై వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కార్తీక్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, హన్మంతు, రాజేందర్, రమేశ్, చరణ్ ఉన్నారు.

షుగర్ టెన్షన్.. బీపీ భయం

(5వ పేజీ తరువాయి)

నియంత్రించేందుకు ప్రభుత్వం కూడా చర్యలు చర్యలు తీసుకుంటోంది. రక్తపోటును ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడి ప్రాణాలే కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డయాబెటీస్(షుగర్)తోనూ అనేక మంది అవస్థ పడుతున్నారు.

తీవ్ర ఒత్తిడితో..

కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలు చేసే వారు, ప్రైవేట్ ఉద్యోగులు, ఉద్యోగాల వేటలో ఒత్తిడికిలోనవుతున్న వారు, ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో బీపీ, షుగర్ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 50ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువ మంది బీపీతో బాధపడుతున్నట్లు తేలింది. వీరికి వైద్యారోగ్యశాఖ ప్రతీనెలా మందులు పంపిణీ చేస్తోంది. డయాబెటీస్ జీవన శైలిపై ఆధారపడి ఉంటుంది. వంశపారంపర్యంగా లేదా మానసిక ఒత్తిడి, జంక్ ఫుడ్ తినడం, సరైన వ్యాయామం లేకపోవడం, పొగాకు, మద్యం వంటి వ్యసనాలు ఉన్నవారికి ఎక్కువగా షుగర్ వస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

కొండాపూర్‌లో ఎన్‌సీడీ క్లినిక్

జిల్లా ఆస్పత్రిలో కొత్తగా ఎన్‌సీడీ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, వృద్ధాప్యసేవలు, మానసిక సమస్యలు, కిడ్నీ, కాలేయ సమస్యలు, నోటి సమస్యలకు చికిత్స అందిస్తారు. బీపీ, షుగర్ వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక డాక్టర్‌ను నియమించారు.

జీవన శైలిని మార్చుకోవాలి



జీవనశైలి, వంశపారంపర్యం, మానసిక ఒత్తిడి, రెగ్యులర్‌గా జంక్‌ఫుడ్ తినడం, వ్యాయామం చేయకపోవడం, పొగాకు, మద్యం వ్యసనాలతో బీపీ, షుగర్‌లు వస్తాయి. ఆహార అలవాట్లను మార్చుకుంటే వీటిని కొంత వరకు తగ్గించుకోవచ్చు. జిల్లాలో అధిక రక్తపోటుతో ఎక్కువ మంది బాధపడుతున్నారు. వీరంతా డాక్టర్ ఇచ్చే మందులు వాడాలి. రోగులకు ఎన్‌సీడీ ద్వారా ప్రభుత్వం మందులందిస్తోంది. క్రమం తప్పక వాడాలి. షుగర్‌ను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. ప్రతీ నాలుగైదు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి.

– డాక్టర్ సీహెచ్‌రాకేష్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్

ప్రతీ ఒక్కరు టెస్టులు చేయించుకోవాలి



ప్రతీ ఒక్కరు టెస్టులు చేయించుకోవాలి. బీపీ, షుగర్ ఉందని తేలితే తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. నిత్యం వ్యాయామం చేస్తూ సమయానికి మందులు వేసుకోవాలి. ప్రభుత్వాస్పత్రుల్లో బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా చేస్తున్నాం. మందులు కూడా ఇస్తున్నాం. బీపీ, షుగర్ ఉన్న వాళ్లు రెగ్యులర్‌గా టెస్టులు చేయించుకోవాలి.

– డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్య అధికారి

శంషాబాద్ లేబర్ అడ్డాల వద్ద సదుపాయాలు కల్పించాలి


ఆందోళన చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ కార్మికులు

శంషాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): లేబర్ అడ్డాల వద్ద కార్మికులకు కనీస వసతులు కల్పించి ఐదు రూపాయల భోజనం పెట్టాలని డిమాండ్‌తో సీపీఐ, ఏఐటీయూసీ కార్మికులు గురువారం ఆందోళన చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ నాయకుడు పానుగంటి పర్వతాలు హాజరై మాట్లాడారు. కార్మికుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అసలైన సాయం మాత్రం చేయడంలేదన్నారు. కార్మికులు కూలి పనుల కోసం అడ్డాల వద్ద గంటల తరబడి వేచి ఉంటారని, వారికి మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. లేబర్ అడ్డాల వద్ద వందలాది మంది ఆకలి తీర్చేందుకు ఐదు రూపాయలకు భోజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయమని ఎన్నాళ్ల నుంచో కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం ఈ సౌకర్యాలు కల్పించాలన్నారు. సీపీఐ నాయకులు గిరి, మల్లేష్, చందు, నరేష్, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కడ్తాల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రావిచెడ్‌లో గురువారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల మాలధారులు, భక్తులు పూజలో పాల్గొన్నారు. కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మార్కెట్ వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ హాజరయ్యారు. వెంకటేశ్, ముకుంద గురుస్వాములు ఇరుముడి పూజలు నిర్వహించారు. అయ్యప్ప భజనలు అలరించాయి.ఇరుముడితో శబరిమల బయల్దేరిన మాలధారులను వెంకటేశ్ సత్కరించారు. సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్బంగా జైపాల్‌రెడ్డి స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, బి.గోపాల్, రమేశ్, వెంకటేశ్, జోగు వీరయ్య, పవన్, మల్లేశ్, బాలకృష్ణ, శ్రీశైలం, నరేందర్‌రెడ్డి, శివ, జహంగీర్ అలీ, సాయికుమార్, హన్మ, రాములు, రాజు, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప పడిపూజలో గంప వెంకటేశ్, దశరథ్‌నాయక్ తదితరులు

అంగన్వాడీ చిన్నారులకు బ్యాగుల పంపిణీ

చేవెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):చిన్నారులకు బ్యాగులు అందజేయడం అభినందనీయం అని చేవెళ్ల అంగన్వాడీ టీచర్ ఉమారాణి అన్నారు. గురువారం చేవెళ్లకు చెందిన వ్యాపారి ముఖేష్ తన కూతురు భావని పుట్టినరోజును పురస్కరించుకొని అంగన్వాడీ చిన్నారులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. మరింతమంది అంగన్వాడీ చిన్నారులకు తోచిన సహాయం అందించాలని టీచర్ కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న అభయ ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చింతలపల్లి, సంకటోనిపల్లి, మంగళపల్లి గ్రామాల్లో గురువారం వృద్ధులకు అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచందర్ ఆధ్వర్యంలో దుప్పట్లు సమకూర్చారు. గ్రామాల్లో ఫౌండేషన్ సభ్యులు వాటిని పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని ఫౌండేషన్ సభ్యులు మల్లికార్జున్, శ్రీనివాస్, రంజన్ కోరారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, రవి, భగవాన్‌రెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి, నాగభూషణం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు'


చౌదరిగూడ: పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు

షాబాద్ డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గురువారం 'చలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చింది. దీంతో ఉదయం నాయకులను పోలీస్‌లు ఎక్కడిక్కడ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎంత అణచేయాలని చూస్తే అంతకు రెట్టింపు స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అరెస్టయిన వారిలో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

యాచారం: అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన మాల మహానాడు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా నాయకుడు గుండాలు, మరో పది మంది హైదరాబాద్‌కు బయలుదేరారు. వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు యాదయ్య, ప్రవీణ్ ఉన్నారు.

చౌదరిగూడ:ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాలమహానాడు నాయకుడు రాజు అన్నారు. జిల్లేడు చౌదరిగూడ పోలీసులు నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులతో అధికారులు

షాద్‌నగర్ రూరల్ డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాలని గురుకులాల ఫైనాన్స్ ఆఫీసర్, అదనపు కార్యదర్శి కిరణ్మయి అన్నారు. కమ్మదనం గురుకుల పాఠశాలలో గురువారం 10వ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రిన్సిపాల్ విద్యుల్లత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని మున్సిపల్ కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. దేశాభ్యున్నతికి ప్రధాని మోదీ సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లిలో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు, బూత్ కమిటీ ఎన్నికల నిర్వహణ తదితరాంశాలపై సమావేశంలో చర్చించారు. గ్రామ 196వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా దుడ్డు పాపయ్య, యూత్ అధ్యక్షుడిగా వీరేశ్‌లను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపాలన సాగిస్తోందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు యాదయ్య, పాండయ్య, నారాయణ, అల్లాజీ, బజార్, భాస్కర్, రమేశ్, జంతుక ఎల్లయ్య, నర్సింహ, చందు, కాటిక ఎల్లయ్య, హరిదాసు, శ్రీశైలం, మహేశ్, కృష్ణ, రామచంద్రి పాల్గొన్నారు.


బూత్ కమిటీకి లక్ష్మణ్ అభినందన

మెనూ ప్రకారం భోజనం అందించాలి

చౌదరిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ వార్డెన్లను ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని ఇంద్రానగర్ బీసీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్తంగా

- **ఇబ్రహీంపట్నం:** ప్రయాణికుల సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో డీఎం వెంకటనర్సప్ప గురువారం తెలిపారు. నేటి సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు, ప్రయాణికులు సమస్యలపై ఫోన్ నంబర్ 9959226141లో సంప్రదించాలని కోరారు.
- **చౌదరిగూడ:** కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.జంగయ్య అన్నారు. పార్టీ శత వసంతాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. తమ పార్టీ ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండా అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్, కృష్ణ, లింగం, చిన్నయ్య, వీరేష్, అంజయ్య, చంద్రమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.
- **ఆమనగల్లు:** భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) ఆమనగల్లు ఏరియా ప్రథమ మహాసభలు ఈ నెల 22న ఆమనగల్లులో నిర్వహిస్తామని సీపీఎం ఏరియా కన్వీనర్ కె.వెంకటయ్య తెలిపారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలో పార్టీ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహాసభల విజయవంతంపై సమావేశంలో చర్చించారు. కార్మికుల, కర్షకుల హక్కుల పరిరక్షణ కోసం సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య, పిప్పళ్ల శివశంకర్, దుబ్బ చెన్నయ్య, పోచయ్య, పడకల్ శాఖ కార్యదర్శి జిల్లెల్ల పెంటయ్య, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
- **చేవెళ్ల:** ఎస్‌జీటీయూ యూనియన్ చేవెళ్ల మండల కార్యవర్గం చేవెళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీయూ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గణేశ్, కో-కన్వీనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్‌జీటీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. చేవెళ్ల మండల ఎస్‌జీటీయూ అధ్యక్షుడిగా దయాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, కోశాధికారి గురు రాజశేఖర్, మీడియా కన్వీనర్‌గా సిహెచ్. కృష్ణ తదితరులను ఎంపిక చేశామని నాయకులు స్పష్టం చేశారు.
- **ఆమనగల్లు:** ఆకుతోటపల్లి, పోలేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఈ నెల 21న మరమ్మతులు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.